క్లుప్తంగా

డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ



కమ్మర్‌పల్లి : వేల్పూర్‌లో సోమవారం 36 డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. గతంలో డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయగా, ఇంకా 36 ఇళ్లు మిగిలిపోయాయి. డ్రా ద్వారా వాటిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ వైస్ చైర్మన్ కుంట రమేశ్, డీపీవో సింహాచలం, తహసీల్దార్ రాజేందర్, ఓఎస్‌డీ విజయేందర్ రెడ్డి, ఎంపీపీ బీమ జమున, వైస్ ఎంపీపీ భోజపల్లి సురేష్, సర్పంచ్ రాధ, రేగుళ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' బిల్లులు చెల్లించాలి

మోర్తాడ్ : పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించిన ఏజెన్సీలకు బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మోర్తాడ్‌లో మాట్లాడారు. 9, 10వ తరగతుల విద్యార్థులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడం శోచనీయం అన్నారు. సమావేశంలో ఏజెన్సీల నిర్వాహకులు నిరంజన, సాయవ్వ, భూమవ్వ, లక్ష్మి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జాన్కంపేట్‌లో చర్చి వార్షికోత్సవం



వేల్పూర్ : మండలంలోని జాన్కంపేట్‌లో ఇండిపెండెంట్ బాప్టిస్ట్ చర్చి నాలుగో వార్షికోత్సవంను సోమవారం నిర్వహించారు. ఐబీసీ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ సోలోమోన్ రాజు ముఖ్య అతిథిగా హాజరై దైవసందేశం వినిపించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఐబీసీ జిల్లా కార్యదర్శి రెవరెండ్ పాస్టర్ మోహన్, స్థానిక పాస్టర్ ఎడ్ల నోవ, ఆర్మూర్ సబ్‌డివిజన్‌లోని పాస్టర్లు, క్రైస్తవులు హాజరయ్యారు.

సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ



బాల్కొండ : బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామంలో పద్మశాలి సంఘ భవనా నిర్మాణానికి సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు భూమి పూజ నిర్వహించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి కృషితో రూ. 7 లక్షల ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈసందర్బంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, సమన్వయ సమితి సభ్యుడు లింగాగౌడ్, ఉప సర్పంచ్ కిషన్, పీఏసీఎస్ చైర్మన్ సురాజ్‌రెడ్డి, రైతు బందు మండల కోఆర్డినేటర్ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి స్థల పరిశీలన



రుద్రూర్ : మోస్రా మండల కేంద్రంలో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనం కోసం సోమవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. మండల కేంద్రంలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటిలో ఒక కేంద్రం అద్దె గదిలో నిర్వహిస్తున్నారు. దీనికి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ సాయిలు, ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు, సర్పంచ్ సుమలతరాం రెడ్డి, ఎంపీడీవో భారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత ఉన్నారు.

కనుల పండువగా పల్లకీసేవ



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ప్రత్యేక సోమవారం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహంతో భక్తులు నిర్వహించిన పల్లకీసేవ కన్నుల పండువగా సాగింది. అనంతరం ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ముగ్గురిపై కేసు నమోదు

భీమ్‌గల్: పొలాల వద్ద కేబుల్ వైర్లు, స్టార్టర్లు దొంగతనం చేసిన ముగ్గురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్ భరత్ రెడ్డి తెలిపారు. బోధన్‌కు చెందిన ఎదిబిది లక్ష్మి, ఎరుకల అశోక్, ఎడపల్లికి చెందిన ఆటో డ్రైవర్ హైమద్ కేబుల్ వైర్లు, స్టార్టర్లు చోరీ చేసి ఆటోలో వెళ్తుండగా.. పురాణిపేట్ గ్రామస్తులు అనుమానించి పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. పురాణిపేటకు చెందిన తోట శంకర్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మెండోరాలోని వెల్కటూర్‌లో తడిసిన పసుపు



రాజాకలాన్‌లో వర్షానికి కొట్టుకుపోయిన వరి ధాన్యం

ధాన్యంపై ఆశలు ఆవిరి..

- వెంటాడుతున్న అకాల వర్షాలు
- కొనుగోళ్లు అంతంతే..
- ఆరబెట్టేందుకు కష్టాలు పడుతున్న అన్నదాత



డొంకేశ్వర్ శివారులో నేలవాలిన నువ్వుల పంట

రెంజల్(బోధన్): వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం కాంట చేసిన తర్వాత కురిసిన అకాల వర్షాలకు తడిసి ముద్దయింది. తిరిగి వాటిని ఆరబెట్టేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు.రైతుల అవసరాలను బలహీనతగా మార్చుకుంటున్న రైస్‌మిల్లర్లు పెత్తనం చెలాయిస్తున్నారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ అకాల వర్షాలు రైతులను కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. తడిసిని ధాన్యం ఆరబెట్టేందుకు కూలీల లేకపోవడంతో ఇంటిల్లి పాది ధాన్యం రాసుల వద్దకు వచ్చి అష్టకష్టాలు పడు తున్న దృశ్యాలు రోడ్లు, పంటపొలాల్లో దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం తడిసిన ధాన్యంతో పాటు మొలకలు వచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని మండల కాంగ్రెస్ నాయకుడు రాజు డిమాండ్ చేస్తున్నారు.

ఎడపల్లిలో..

ఎడపల్లి(బోధన్) : మండలంలో గత పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతన్నలకు రాత్రులు కునుకు లేకుండా చేస్తున్నాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఎకరాకు రూ. 3వేలకు పైగా ఖర్చు అవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట కోయని రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. హార్వెస్టర్ మిషిన్లు లేక ట్రాక్టర్లు పంటపొలాల్లోకి వెళ్లకపోవడంతో అదనపు భారం ఎకరాన రూ. 5,000 పడుతుందని వాపోతున్నారు.

వరిని పరిశీలించిన ఆర్డీవో

బోధన్‌రూరల్(బోధన్) : పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ఆర్డీవో రాజేశ్వర్ పరిశీలించారు. సోమవారం ఏఎంసీ కార్యాలయంలో తడిసిన ధాన్యాన్నిత ఆర్డీవో రాజేశ్వర్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మరో నాలుగైదు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంకా వరి ధాన్యాన్ని కోయని రైతులు రెండు, మూడు రోజులు ఆగాలని ఆయన సూచించారు. ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయి, రైతు నాయకులు బుద్దె రాజేశ్వర్, రైతులు ఉన్నారు.

డొంకేశ్వర్‌లో 200 ఎకరాల్లో పంటనష్టం

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఆది, సోమవారాల్లో కురిసిన అకాల వర్షానికి డొంకేశ్వర్ మండలంలో 200 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. మండల పరిధిలో మొత్తం 13 గ్రామ పంచాయతీల పరిధిలో 590 ఎకరాల్లో నువ్వు పంటను సాగు చేశారు. ఐతే, వర్షాలకు 40 శాతం పంట నేలవాలింది. అలాగే చేన్లలో ఉన్న వరిపంటకు కూడా స్వల్పంగా నష్టం జరిగింది. పంట నష్ట వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపినట్లు ఏఈవోలు మౌనిక, నరేశ్‌లు 'సాక్షి'కి తెలిపారు. కాగా, కల్లాలో తడిసిన వడ్లను ప్రభుత్వం లెక్కలోకి తీసుకోకపోవడం పట్ల మండలంలోని రైతులు అసతృప్తిగా ఉన్నారు.



బోధన్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్

రెంజల్‌లో..

రెంజల్(బోధన్): వారం రోజుగులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. మండలంలోని బోర్గాం చెరువు కింద వేసిన వరిలో మోకాలు లోతు బురద చేరడంతో స్థానిక రైతులు పైపైన వరి దుబ్బులను కోస్తు గింజలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. మోకాలు లోతు బురదను లెక్క చేయకుండా కోసిన దుబ్బులను టబ్బులో నింపుకుని రోడ్డు పై ఆరబెడుతున్న దృశ్యం వారి అకాల కష్టాలకు నిదర్శనంగా నిలుస్తుంది.

బాల్కొండలో..

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి తెల్లవారు జామున వరకు వర్షం మళ్లీ దంచి కొట్టింది. ప్రధానంగా వరి రైతులకు గోసాతప్పడం లేదు. ధాన్యం కుప్పలు, బస్తాలు తడిసి ముద్దవుతున్నాయి. వాటిని ఆరబెట్ట లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. నువ్వు సాగు చేసిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. మరో 5రోజులు వర్షాలు కురియనున్నాయి.

ఆర్థికసాయం చేయాలి



గత పది రోజుల క్రితం నాకున్న ఆర ఎకరం భూమి పంట కోసి ఆరబెట్టిన ఈ చెడగొట్టు వర్షం నా ధాన్యం తడిసిపోయింది. కూలీలు పెట్టి ధాన్యంను ఆరబెట్టిన తర్వాత మళ్లీ వర్షం పడటంతో మొలకలు వచ్చాయి. వాతావరణ శాఖ ఇంకా రెండు రోజులు వర్షం ఉందని చెప్తుంటే ఏం చేయాలో తెలియట్లేదు.

– పరమలి బుచ్చయ్య, తాడెం

పంటల పరిశీలన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామంలో అకాల వర్షానికి నష్ట పోయిన పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి హరికృష్ణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్బంగా గ్రామంలో దెబ్బతిన్న నువ్వు పంట, కూరగాయాల పంటలు, అలాగే తడిసిన వరి ధాన్యాన్ని ఏవో పరిశీలించారు. పంటల నష్టానికి సంభందించిన నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. సొసైటీ చైర్మన్ బంటు దయానంద్, సర్పంచ్ జమున గంగాధర్, ఎంపీటీసీ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

పంట రుణాలను మాఫీ చేయాలి



కమ్మర్‌పల్లి : ప్రకృతి వైపల్యంతో నష్టపోయిన రైతాంగానికి ఈయేడు చెల్లించాల్సిన రుణాలను మాఫీ చేయాలని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని మానాల గ్రామంలో ఆదివారం వడగండ్ల వానతో దెబ్బతిన్న వరి పంటలతో పాటు, కల్లాలో తడిచి పోయిన ధాన్యాన్ని పరిశీలించారు. అకాల వర్షం పంటను ముంచెత్తిందని రూ. 50 వేలు ఎకరానికి పరిహారం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడా శిబిరం ప్రారంభం



పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మండలం మగ్గిడిలో సోమవారం వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక ఉప సర్పంచ్ సుద్దపల్లి నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. పీఈటీ మధు మాట్లాడుతూ మే ఒకటో తేదీ నుంచి 31 తేదీ వరకు శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నా రు. వీడీసీ సభ్యులు మోహన్ రెడ్డి, ఆదర్శ యూత్ సభ్యులు చిన్నారెడ్డి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



మాక్లూర్ : మాక్లూర్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల బాధితులకు జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, తహసీల్దార్ శంకర్, ఎంపీవో శ్రీనివాస్, కో –ఆప్షన్ అహ్మద్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్పొరేటర్ రాయ్ సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు సుక్కి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోమన్‌పల్లిలో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం కోమన్‌పల్లిలో సోమవారం లబ్ధిదారులకు సర్పంచ్ నీరడి రాజేశ్వర్ కళ్యాణ లక్ష్మీ చెక్కులను అందజేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సర్పంచ్ చెక్కులను అందజేశారు.

పంటలకు పరిహారం చెల్లించాలి



ఆర్మూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్ : అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహా రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి, ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణ శివారులో తడిసిన వరి ధాన్యాన్ని బీజేపీ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల నుంచి త్వరగా ధాన్యాన్ని సేకరించక పోవడం వల్లే అకాల వర్షాలకు తడిసిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె శ్రీనివాస్, పులి యుగందర్, తిరుపతి నాయక్, శ్రీకాంత్, టీ పోశెట్టి, శేషగిరి లింగం, నారాయణ, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరిపించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, అక్రమ ఇంటి నెంబర్ల కేటాయింపులపై జిల్లా స్థాయి అధికారులతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేశారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని పట్టణంతో పాటు విలీన గ్రామాలైన పెర్కిట్, మామిడిపల్లిలో ప్రభుత్వ స్థలాలు, ఇరిగేషన్ స్థలాల ఆక్రమణకు పాల్పడుతున్న వారికి ఇంటి నెంబర్లు కేటాయించి రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా మున్సిపల్ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాస్థాయి అధికారులతో విచారణ జరిపించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఈ సందర్బంగా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేశ్, మీసాల రవి, మందుల పోశెట్టి తదితరులు ఉన్నారు.

కార్మికుల పనిభద్రతపై పోరాడుదాం

నందిపేట్ (ఆర్మూర్): ఉపాధి కార్మికుల పని భద్రత కోసం పోరాడాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఇచ్చారు సోమవారం నందిపేట మండల కేంద్రంలో ఈమెరకు ఎంపీడీవో నాగవర్ధన్ వినతి పత్రం అందజేశారు ముందుగా నందిపేట మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.

ఉపాధికి సంబంధించి రెండునెలల కూలీ రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైన చిన్న మల్లయ్య రాజలింగం దేవన్న దావూద్ రామన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సేవతో పాటు వ్యక్తిత్వ వికాసం



రుద్రూర్ : గ్రామ సర్పంచ్‌గా విధులు నిర్వర్తిస్తూనే ఇంపాక్ట్ సంస్థ ద్వారా వ్యక్తిత్వ వికాసం (పర్సనాలిటీ డవలప్‌మెంట్) కోర్సును పూర్తి చేసి సర్టిఫికెట్‌ను అందుకున్నారు. మండలంలోని అక్బర్‌నగర్ సర్పంచ్ తిగుళ్ల గంగామణి ప్రసాద్. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపి ఉత్తమ జీపీగా అవార్డు కూడా అందుకున్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం



బోధన్ : పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీకి చెందిన సామాజిక కార్యకర్త కారం స్వామికి రాష్ట్ర ప్రభుత్వం దళితరత్న అవార్డును అంబేడ్కర్ జయంతి సందర్బంగా ప్రధానం చేసింది. ఆదివారం రాత్రి పట్టణ కేంద్రంలో అవార్డు గ్రహీతకు దళిత సేన జాతీయ అధ్యక్షుడు జేబీ రాజు సన్మానించి అభినందించారు. ఎస్సీ, ఎస్టీహక్కుల పరిరక్షణ కమిటీ డివిజన్ శాఖ గౌరవ అధ్యక్షుడు పరిమి కోటేశ్వర్‌రావు, నీరడి ఈశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా మేడే..

అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని నియోజకవర్గాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు జెండాలు ఎగురవేసి సంబురాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



మాక్లూర్‌లో ఐఎంఎల్ డిపోలో నినాదాలు చేస్తున్న కార్మికులు



పోచంపాడ్ వద్ద జెన్‌కో కార్యాలయం వద్ద మేడే వేడుకల్లో మాట్లాడుతున్న ఎస్‌ఈ



బోధన్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..



బోధన్ మున్సిపల్ ఆఫీసు ఎదుట..



నవీపేటలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..



వేల్పూర్‌లోని రామన్నపేటలో..



రెంజర్లలో కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మోర్తాడ్‌లో..



ఆర్మూర్ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో..



బోధన్ రూరల్‌లోని ఏఎంసీ కార్యాలయంలో..



పెర్కిట్ పరిధిలోని ఆలూర్‌లో..



నందిపేటలో..



మామిడిపల్లిలో..



రుద్రూర్‌లో..

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె

మోర్తాడ్ : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంలో జాప్యంను వ్యతిరేకిస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మోర్తాడ్‌లో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కళ్లకు గంతలు కట్టుకుని ప్రభుత్వం తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు.

రెంజల్(బోధన్): రెంజల్‌లో జేపీఎస్‌లు ఎంపీడీవో కార్యాలయం ముందు చేపడుతున్న నిరవధిక సమ్మెలో కళ్లకు గంతలు కట్టుకుని కూర్చున్నారు. పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న దీక్షలకు మండల రైతు కూలీ సంఘం నాయకులు మద్దతు ప్రకటించారు.

నవీపేట : జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని చేపట్టిన దీక్ష సోమవారం కొనసాగింది. మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు.

బాల్కొండ : మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం రెండవ రోజు సమ్మె నిర్వహించారు. సీఎం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు.

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.

పంచకుండాత్మక శ్రీరామ యజ్ఞం ప్రారంభం

రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి శ్రీ సీతారాం ధాం సంత్ సేవాశ్రమంలో పంచకుండాత్మక శ్రీ రామ మహాయజ్ఞం ప్రారంభమైంది. మూడవ రోజైన సోమవారం భక్తులచే యజ్ఞశాలలో పూజన్, హవన్ కార్యక్రమాలను నిర్వహించారు. వైదిక బ్రహ్మణులచే యజ్ఞ, హోమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కందకుర్తి శ్రీరామ మహాయజ్ఞ సమితీ ఆధ్వర్యంలో సేవాశ్రమ వ్యవస్థాపకులు సీతారాం త్యాగి మహారాజ్ పర్యవేక్షణలో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

ఆధ్యాత్మిక జ్ఞాన జ్యోతిని వెలిగించాలి

బోధన్ : ఆధ్యాత్మిక జ్ఞాన జ్యోతి ప్రతి ఇంట సదా వెలుగాలని, దేవ దేవుడు మహాదేవుడిని నిత్యం స్మరించడం మరువొద్దని మహారాష్ట్ర ప్రాంత శివకీర్తన పండితులు అన్నారు. సాలూర మండల కేంద్రంలోని రాచన్న మందిరం వద్ద వీరశైవ లింగాయత్ సమాజ్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో 4వ అఖండ శివనామ సప్తాహం వేడుకలు గత నెల 24న ప్రారంభించగా సోమవారం ముగిశాయి. ముగింపు వేడుకలకు ఏసీపీ కిరణ్ కుమార్, ఏఎంసీ చైర్మెన్ వీఆర్‌దేశాయ్ దంపతులు,రూరల్ సిఐ శ్రీనివాస్‌రాజు, తహశీల్దార్ మమతలు అతిథులు విచ్చేశారు.